లవ్ లీ స్టోరీస్

# బాటసారులు

దాదా హయాత్.

## మద్రాసులో రైలెక్కిన క్షణం నుంచీ ఆమెను గమనిస్తూనే వున్నాడు విద్యాపతి.

దురుద్దేశంతో మాత్రం కాదు. కీకారణ్యంలో దారితప్పి బెదిరిపోయిన లేడిపిల్లలా కనిపిస్తోందామె. ఆమె కళ్ళలో ఏదో వేదన గూడుకట్టుకున్నట్టుగా వుంది. మొహంలో ఆందోళన తాండవిస్తోంది.

విద్యాపతి కూర్చున్న సీటుకి ఎదురుగానే కూర్చుందామె. విద్యాపతి ఉనికిని గుర్తించినట్టేలేదు. విద్యాపతిని మాత్రమే కాదు. ఆమె ఆ పెట్టెలో వున్నవారెవరి ఉనికినీ గుర్తించినట్టు కనబడలేదు.

బయల్దేరే సమయం ఆసన్నమవుతూనే రైలు కూతవేసుకుంటూ కదిలింది. పెరంబూరు స్టేషన్ దాటుతుండగా టికెట్ కలెక్టర్ వచ్చాడక్కడికి. విద్యాపతి మౌనంగా తన టిక్కెట్టు తీసి చూపించాడు. అతని టిక్కెట్టు పంచ్ వేసి టికెట్ కలెక్టర్ ఆమె వైపు తిరిగాడు ''టికెట్ ప్లీజ్''.

అతను తనని ఉద్దేశించి మాట్లాడుతున్నాడని ఆమె గుర్తించలేదు. అతను మరోసారి ''టికెట్ ప్లీజ్'' అనేసరికి వులిక్కిపడి అతనివైపు చూసింది.

''టికెట్ ప్లీజ్'' ఓపిగ్గా, అన్నాడు టిక్కెట్ కలెక్టర్.

ఆమె మొహం ఉన్నట్టుండి పాలిపోయింది.

''టికెట్టా!'' అంది అయోమయంగా చూస్తూ.

టికెట్ కలెక్టర్ మంచివాడులా వున్నాడు. ''మీరు టికెట్ తీసుకోలేదా?'' శాంతంగా అడిగాడు.

ఆమె అవునో కాదో కూడా తెలీని విధంగా అదో మాదిరిగా తలాడించింది.

''టిక్కెట్టు లేకపోతే ఇప్పుడు తీసుకోండి'' చెప్పాడతను.

ఆమె అతనివైపు వెర్రిదానిలా చూస్తుండిపోయింది.

విద్యాపతి అప్పుడే మొదటిసారిగా కలగజేసుకున్నాడు.

''చూడండి మీరెక్కడికెళ్ళాలి?''

''ఈ రైలు ఎక్కడికెళ్తుంది?'' ఎదురుప్రశ్న వేసిందామె.

విద్యాపతి ఆ ప్రశ్న ఊహించలేదు.

''ఇది హైదరాబాదు ఎక్స్‌ప్రెస్. హైదరాబాదు వెళ్తుంది. మీరెక్కడికెళ్ళాలి?'' బుజ్జగిస్తున్నట్టుగా అన్నాడు.

''హైదరాబాద్!'' ఆమె ఒక్కసారిగా గుండె మీద చెయ్యివేసుకుంది.

''ఏం? మీరు వెళ్ళాల్సింది ఈ రైలు కాదా?'' అడిగాడు విద్యాపతి.

ఆమె ఏమనాలో తోచనట్టు వెర్రిగా చూసి అయోమయంగా తలాడించింది.

విద్యాపతి నిట్టూర్చాడు. అతనేదో అనబోతుండగా టికెట్ కలెక్టర్ మళ్ళీ నోరు విప్పాడు. ''దయచేసి మీరెక్కడికి వెళ్ళాలో చెప్పండి''.

ఈసారి అతని గొంతులో కాఠిన్యం ధ్వనించేసరికి ఆమె పూర్తిగా బెదిరిపోయింది. ''హ... హ... హైదరాబాదే వెళ్ళాలి'' అంది తడబడిపోతూ.

''మరైతే హైదరాబాదుకు టిక్కెట్టు తీసుకోండి'' అంటూ అందుకు డబ్బెంతవుందో చెప్పాడు టికెట్ కలెక్టర్.

డబ్బుమాట వింటూనే ఆమె నాలుక తడారిపోయినట్టు గుటకలు మింగుతూ చూసింది. టికెట్ కలెక్టర్ సహనం కోల్పోయాడు. ''టికెట్టుకు డబ్బు లేకపోతే రైలెందుకు ఎక్కారండీ?'' అన్నాడు కసురుతూ.

అవమాన భారంతో ఆమె మొహం ఎర్రబడింది.

కళ్ళనిండా నీళ్ళు అప్పటికప్పుడే పొంగుకొచ్చాయి.

విద్యాపతికి ఆమె స్థితి జాలికలిగించింది.

''పాపం అయినింటి ఆడపడుచులా ఉంది. అలా కసిరి కొట్టకండి. ఆమె టిక్కెట్టు డబ్బులు నేనిస్తాను'' అన్నాడు.

టికెట్ కలెక్టర్ అతనికేసి విచిత్రంగా చూశాడు. ఈ కలియుగంలో కూడా ఇలా ఎదుటివారిని ఆదుకునే వారుంటారా అనే విస్మయం అతని

ఇది హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్. హైద్రాబాద్ వెళ్తుంది. మీరెక్కడికి వెళ్ళాలి? అడిగాడతను. 'హైదరాబాద్?' ఆమె ఒక్కసారిగా గుండె మీద చెయ్యి వేసుకుంది.

చూపుల్లో స్పష్టంగా కనిపించింది.

విద్యాపతి అతనికి డబ్బులు తీసిచ్చాడు. టికెట్ కలెక్టర్ ఆమె పేరిట ఫైనుతో సహా టికెట్టు రాయడానికి రసీదు పుస్తకం తెరిచి పేరడిగాడు.

ఆమెకు మొదట అతనేం అడుగుతున్నాడో అర్థం కాలేదు.

"ఆయనకు మీ పేరు చెప్పండి" మృదువుగా అన్నాడు విద్యాపతి.

"సుధేష్ణ" ఏదో లోకంలో వున్నట్టుగా జవాబిచ్చిందామె.

టికెట్ కలెక్టర్ సుధేష్ణ పేరిట టికెట్టు రాసి, "ఇదే మీ బెర్తు" అని చెప్పి వెళ్ళిపోయాడు.

"ఈ రోజు మీ అదృష్టం. లేకపోతే ఇంత సులభంగా మీకు బెర్తు దొరికేది కాదు. ఆ టికెట్ కలెక్టరు నిర్దాక్షిణ్యంగా మిమ్మల్ని దింపేసేవాడు" అన్నాడు విద్యాపతి.

సుధేష్ణ మాట్లాడలేదు. కనీసం అతనికి కృతజ్ఞతలు కూడా చెప్పలేదు. తల అవతలికి తిప్పుకుని శూన్యంలోకి చూస్తున్నట్టు కిటికీలోంచి బయటకు చూస్తుండిపోయింది.

**అవమానభారంతో ఆమె మొహం ఎర్రబడింది. అప్పటికప్పుడే కళ్ళనిండా నీళ్ళు పొంగుకొచ్చాయి.**

విద్యాపతి మరింక ఆమెను మాట్లాడించడానికి ప్రయత్నించలేదు. సంచిలోంచి ఓ నవలేదో బయటకు తీసి చదవడంలో మునిగిపోయాడు.

రాత్రి బాగా చీకటి పడిపోయి అతనికి నిద్ర ముంచుకొస్తున్నప్పుడు పుస్తకంలోంచి తల పైకెత్తి చూశాడు.

ఆమె ఇంకా అలా కూర్చునే వుంది.

అతను నిట్టూర్చి తన బెర్తుమీద మేనువాల్చాడు. కాసేపట్లోనే అతనికి నిద్రపట్టింది. అర్ధరాత్రి పూట ఎప్పుడో అతనికి మెలకువ వచ్చి చూసినప్పుడు కూడా ఆమె అలా కూర్చునే వుంది. కాకపోతే ఈ సారి భుజాల చుట్టూ పైట కప్పుకుని. కాళ్ళు రెండూ బెర్తు మీదుంచుకుంది. ఆమె కళ్ళు పైన తిరుగుతున్న ఫ్యానుకేసి తదేకంగా చూస్తున్నాయి. మోకాళ్ళ చుట్టూ చేతులు కట్టుకుని దిగాలుగా కూర్చుంది.

విద్యాపతి అప్పుడు కూడా ఆమెతో ఏమీ అనలేదు. అయితే ఆ తర్వాత చాలా సేపటి వరకూ అతనికి నిద్రకూడా పట్టలేదు. ఆమె ఎవరై వుంటుంది అనే ఆలోచనతో అలా మెలకువగానే వుండిపోయాడు. ఆ రాత్రి రైల్లో అతనికి గుర్తున్నంతవరకూ ఆమె దిగాలుగా అలా కూర్చునే వుంది. ఆ తర్వాత మళ్ళీ అతనికి నెమ్మదిగా నిద్రపట్టింది.

ఆ రైలు ఆ మర్నాడు హైదరాబాదు చేరాల్సిన సమయం కంటే గంట ఆలస్యంగా చేరింది. ఆ సమయానికి అతను మొహం కడుక్కుని తలదువ్వుకుని నీటుగా తయారై కూర్చున్నాడు! ఎదురు



## లవ్ లీ స్టోరీస్



# నిధులకోసం 'షో'లు

బొంబాయిలోని చాలామంది నటీనటులు తాము ఖాళీగా వున్నప్పుడు విదేశాలలో జరిగే 'షో'లలో పాల్గొంటూ వుంటారు. వాటి వలన డబ్బూ వస్తుందీ, విదేశాలలో ఎంజాయ్ చేసినట్లు వుంటుంది. ప్రస్తుతం చాలా ఖరీదైన మూడు 'షో'ల గురించే అంతా మాట్లాడుకొంటున్నారు. సినీ ఆర్టిస్ట్ వెల్ఫేర్ ట్రస్ట్ కోసం నిధులు సేకరించేందుకు వాటిని ఏర్పాటు చేస్తున్నారట. మొదటి షో మే 23న లండన్‌లో, రెండవది మే 29న న్యూయార్క్‌లో, మూడవది చికాగ్‌లో మే30న జరుగుతాయి. వాటిలో దిలీప్‌కుమార్, అనిల్‌కుమార్, నంజయ్‌దత్, జాకీ, రిషీ, అజ క్ దేవగన్, మాధురి దీక్షిత్, దివ్య, కరిష్మా, రవీనా మొదలగువారు పాల్గొంటారట.

◆◆◆◆

గా బెర్తు మీద ఆమె ముడుచుకు పడుకొనుంది. రైలు ఆగాక అయినా ఆమె లేస్తుందేమోనని అతను ఎదురుచూశాడు. అయితే రైలు ఆగాక కూడా ఆమె అలా ముడుచుకుపడుకునే వుంది. ఆమె మొహం వాడిన పువ్వులా వుంది.

అతను కొద్ది క్షణాలు తటపటాయించి ఆమెకు సమీపంగా వెళ్ళాడు.

"ఏవండీ! హైదరాబాదు వచ్చేసింది. లేవండి."

ఆ ఒక్క పిలుపుకే ఆమె అదిరిపాటుతో లేచి కూర్చుంది.

"ఆ! ఏమైంది?" ఆమె కళ్ళు భయవిహ్వలంగా విచ్చుకున్నాయి. ఆమె మానసిక పరిస్థితి ఏమిటో ఆ కళ్ళను చూస్తే తెలిసిపోతోంది.

"ఏం కాలేదు. హైదరాబాదు వచ్చేసింది— అంతే" అన్నాడతను.

ఆమె ఒకసారి అయోమయంగా కిటికీలోంచి బయటికి చూసింది. అప్పుడుగానీ తను రైలు దిగాలని ఆమెకు అర్థం కాలేదు. "ఓ! అయితే వచ్చేసిందా!" అంటూ నిరాసక్తిగా అలాగే కూర్చుండిపోయింది.

అతను రైలు దిగిపోవడానికి తాపత్రయపడకుండా నిదానంగా మళ్ళీ తనబెర్తుమీద కూర్చున్నాడు.

"హైద్రాబాద్‌లో మీరెక్కడికి వెళ్ళాలి?" అడిగాడు.

"ఎక్కడికి వెళ్ళాలో నాకే తెలీదు" అందామె.

"క్షమించండి. మిమ్మల్ని చూస్తుంటే ఏదో ఆపదలో చిక్కుకున్నవారిలా కనిపిస్తున్నారు. మీరెవరూ ఏమిటీ అనే వివరాలు ఇప్పుడే నాకు చెప్పనక్కర్లేదు. ఇక్కడ నిజంగానే మీకెవరూ వున్నట్టు లేరు. మీ మనసు కుదుటపడి ఏం చేయాలో మీరు నిర్ణయించుకునే దాకా మా ఇంట్లో వుంచవచ్చు."

ఆమె కళ్ళు అతన్ని అనుమానంగా చూశాయి.

"నేను చెడ్డవాణ్ణి కాదు", చెప్పాడతను. "ఈ నగరం మీలాంటి నిస్సహాయులైన ఆడవాళ్ళు ఒంటరిగా తిరగడానికి సరైంది కాదు. ఇక్కడ జరిగే ఆగడాలు రోజూ పేపరు చూస్తే మీకే తెలుస్తుంది. మీ పరిస్థితి చక్కబడే దాకా నిస్సంకోచంగా మా ఇంట్లో వుండవచ్చు."

ఆమె తలదించుకుని కొద్ది క్షణాలు మౌనంగా వుండిపోయింది. తర్వాత మళ్ళీ నెమ్మదిగా తలపైకెత్తి అతని కళ్ళలోకి సూటిగా చూసింది. "సరే! ఇప్పుడంతకంటే చెయ్యగలిగిందేముంది?" మంద్రస్వరంతో చెప్పింది.

స్టేషన్ నుంచి ఆటోలో ఆమెను నేరుగా తన ఇంటికి తీసుకెళ్ళాడతను. అతను తన ఇల్లుగా అభివర్ణించింది ఒకానొక కాలనీలో కేవలం రెండు గదులు మాత్రమే ఉన్న చిన్న అపార్ట్‌మెంట్. ఆ అపార్ట్‌మెంటులో అతను తప్ప ఎక్కడి వస్తువులక్కడ చిందరవందరగా పడున్నాయి.

"రండి, ఇదే నా ఇల్లు. ఇక్కడ అనవసరమైన ప్రశ్నల్తో మిమ్మల్ని వేధించే వాళ్ళెవరూ వుండరు. పెద్ద నగరాల్లో వుండడంలో అడ్వాంటేజ్, డిసడ్వాంటేజ్ ఒక్కటే— ఎవరూ ఎవరి గురించీ పట్టించుకోరు. కాబట్టి మీరు వుండగలిగినన్ని రోజులు ఇక్కడే వుండొచ్చు" చెప్పాడతను.

ఆమె ఓ గోడకు జారగిలబడి అతను చెప్పేది నిర్లిప్తంగా వింటోంది. ముందర గదిలో చిందరవందరగా పడున్న వస్తువులు ఒక్కొక్కటిగా ఏరుతూ అతను తన గురించి చెప్పుకుంటూ వెళ్ళాడు—

"నా పేరు విద్యాపతి. నేనో ఫ్రీలాన్సు ఆర్టిస్టుని. పత్రికలకు రేఖాచిత్రాలు గట్రా గీసిస్తుంటాను. ఇప్పుడిప్పుడే నాకు పేరొస్తోంది. మద్రాసు తెలుగు అకాడమీ వాళ్ళు నాలాంటి వాళ్ళందర్నీ ఒకచోట చేర్చి చిన్న వర్క్‌షాపు లాంటిది నిర్వహించారు. అక్కడికి వెళ్ళి వస్తుండగానే మీతో పరిచయం కలిగింది. అవతల బాత్‌రూం ఉంది. టాంకులో నీళ్ళు వస్తుంటాయి. అక్కడే ఇమర్షన్ హీటరు కూడా వుంది మీరు ప్రశాంతంగా స్నానం చేయవచ్చు. ఈలోగా మీరు తింటానికేమైనా పట్టుకొస్తాను. రాత్రి నుంచీ మీరేమీ తిన్నట్టే లేరు" అంటూ ఏరిన వస్తువులన్నీ ఓ మూల టేబుల్ మీద పడేసి బయటికెళ్ళాడు.

అతను తిరిగి వచ్చే సమయానికి కూడా ఆమె స్నానం చేయలేదు. కనీసం మొహం కూడా కడుక్కోలేదు.

"అరె! మీరింకా ఇలాగే వున్నారా! మరేం పర్లేదు. మొహం కడుక్కొచ్చి ఇది తినండి. ఆ కళ్ళలో ప్రాణం వస్తుంది" చెప్పాడు.

అంతవరకూ గోడకు చేరగిలబడి నేలమీద కూర్చొని పై కప్పుకేసే శూన్యంగా చూస్తున్నదల్లా ఆమె అతని బలవంతం మీద లేచివెళ్ళి మొహం కడుక్కొచ్చింది. అతను తెచ్చిన పదార్థాలు కొద్దిగా కతికి అనాసక్తిగా పక్కన పెట్టేసింది. అతనామెను తినమని మరింక బలవంతం చేయలేదు.

మూడురోజుల పాటు ఆమె స్నానపానాదులు లేకుండా నిస్సత్తువగా అక్కడే పడుంది. అతనామె మనసుకు ఉల్లాసం కలిగించి ఈ లోకంలోకి తీసుకురావడానికి రకరకాల కబుర్లు చెప్పేవాడు.

(ఈ కథకు ముగింపువచ్చేవారం)

లవ్ లీ స్టోరీస్

# బాటసారులు


దాదా హయాత్

**తన బొమ్మల గురించీ, తను గీసే బొమ్మలగురించీ, ఆ బొమ్మలు చోటు చేసుకొనే పత్రికల గురించీ, ఆపత్రికల్లో పనిచేసే వ్యక్తుల గురించీ వివరించేవాడు.**

రాజకీయాల గురించీ, సినిమాలగురించీ, నవలల గురించీ — ఒకటనేమిటి, మనసుకేది తడితే ఆ విషయం గురించి చర్చించేవాడు.

ఆమె మొదట్లో అతని వాగుడంతా నిర్లిప్తంగా, నిరాసక్తిగా వింటూ కూర్చుండిపోయేది. క్రమంగా ఆమె కళ్ళలో అతని మాటలపట్ల ఒక విధమైన ఆసక్తి పొడసూపనారంభించింది.

ఆ మూడు రోజుల్లో అతను తన గురించి మరికొన్ని వివరాలు కొద్ది కొద్దిగా ఆమెకు తెలియజేశాడు. అతనికి తల్లితండ్రీ లేరు. ఉన్నవాళ్ళంతా దూరపు బంధువులే. వాళ్ళు కూడా గుంటూరు జిల్లాలోని ఏదో పల్లెటూళ్ళో వుంటారు. రాకపోకలు బొత్తిగా లేవు. దరిమిలా అతను పూర్తిగా



ఒంటరి జీవితం గడుపుతున్నాడు.

అతని ప్రవర్తన పట్ల ఆమె మనసులో మొదట ఏ కొద్దిపాటి అనుమానాలున్నా ఒకటి రెండు రోజుల్లోనే అవన్నీ నిరాధారమైనవేనని తేలిపోయింది. దాంతో ఒకటీ అరా అతన్తో తనంతట తనే మాట్లాడ్డం ఆమెకు నెమ్మది నెమ్మదిగా అలవాటైంది. దాంతో అతను తనకు అపరిచితుడన్న భావం ఆమెలో క్రమంగా దూరం కాసాగింది.

రాను రాను ఆమె గురించి ఒకటొకటిగా పూర్తి వివరాలు అతనికి తెలిసిపోయాయి. ఆమె కథ చాలా జాలిగొలిపేది మాత్రమే కాదు. సమకాలీన వైవాహిక జీవిత చిత్రంలో సమాజం రచిస్తున్న వికృతరూపాలు స్పష్టంగా కళ్ళముందుకు తెచ్చే కథ.

ఆమెకు పెళ్ళయిందని మొదటిసారి ఆమెను రైల్లో చూసినప్పుడే అర్థమైంది విద్యాపతికి. ఆమె మెడలో తాళిబొట్టు, కాళ్ళకు మెట్టెలు ఆ విషయం అతనికి తెలియజేశాయి.

ఆమె భర్త మద్రాసులోని ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. లక్ష రూపాయల కట్నంతో పది తులాల బంగారంతో ఆమె పెళ్ళి చేశాడు తండ్రి. పెళ్ళయి ఏడాదిన్నర గడిచి ఒక కొడుకు పుట్టాక గానీ ఆమెకర్థం కాలేదు తన భర్తకు తాను మొదటి భార్య కాదని. అతనికి ఇదీ వరకే పెళ్ళయిందనీ, మాంబళంలో ఒక భార్యను రహస్యంగా వుంచి పోషిస్తున్నాడనీ, కేవలం కట్నం కోసమే తనని పెళ్ళి చేసుకున్నాడనీ గ్రహించేసరికి చాలా ఆలస్యమైంది.

"అప్పుడు మీరేం చేశారు?" ఆమె వంక జాలిగా చూస్తూ అడిగాడు విద్యాపతి.

"ఏం చేస్తాను? మా నాన్నతో నా భర్త చేసిన కుట్ర గురించి మొరపెట్టుకున్నాను. ఆయన తను నిస్సహాయుడనీ ఈ విషయంలో ఏమీ చెయలేననీ చెప్పేశాడు. అన్నింటికంటే దారుణం ఏమిటంటే అసలు మా పెళ్ళే చెల్లదు. అయినా పరిస్థితుల్తో రాజీపడి భర్తతో ఎలాగో సర్దుకుపోయి కాపురం చెయ్యమని సలహా ఇచ్చాడు.

"కొన్నాళ్ళు నాన్న చెప్పినట్టే చేశాను. తన గురించి నాకు నిజం తెలిసిపోయిందని గుర్తించాక నా భర్త తన అసలు రంగు బయటపెట్టడం మొదలుపెట్టాడు. మా నాన్న దగ్గర్నుంచి డబ్బు తెమ్మని రోజూ వేధించేవాడు. ఒక్కోసారి ఇంటికి తాగొచ్చి కొట్టేవాడు. డబ్బు తీసుకురాకపోతే నాలుగు తన్ని ఇంట్లోంచి గెంటేస్తానని బెదిరించేవాడు".

"ఇంకేం చెప్పకండి" ఆమె మాటకు అడ్డొస్తూ అన్నాడు విద్యాపతి. "నాకంతా అర్థమైపోయింది. మీ భర్త మిమ్మల్ని హింసిస్తున్నాడని మీ నాన్నగారితో మీరు మళ్ళీ మొరపెట్టుకున్నారు. బహుశా అతన్తో ఇక కాపురం చేయలేనని కూడా చెప్పి వుంటారు. కానీ, మీ పుట్టింటివారు మీకేదైనా సహాయం చేసే బదులు శుష్కమైన నీతులు చెప్పి మిమ్మల్ని మళ్ళీ ఆ నరకానికే తోలేశారు. అతను మిమ్మల్నింకా క్రూరంగా హింసలు పెట్టాడు. డబ్బు తీసుకురమ్మని ఒకరోజు నిజంగానే మిమ్మల్ని ఇంట్లోంచి బయటికి గెంటేశాడు. పుట్టింటికి వెళ్ళినా మీకు జరిగే సహాయమేమీ లేదనే నిస్పృహతో మీరు కనబడ్డ రైలెక్కేశారు. ఆ రైలు ఎక్కడికి వెళ్తుందో ముందూ వెనకా ఆలోచించను కూడా లేదు. అంతేనా?" అన్నాడు.

సుధేష్ణ రెండు చేతుల్లోనూ మొహం దాచుకుంది.

"కానీ, నా బిడ్డ! నా బిడ్డను కూడా నానుంచి లాక్కుని నన్ను బయటికి గెంటేశాడాయన!" రోదించనారంభించింది.

విద్యాపతి జాలిగా ఆమె వంక చూస్తుండిపోవడం తప్ప ఏమీ మాట్లాడలేక పోయాడు. ఇది సుధేష్ణ కథ మాత్రమే కాదు. ఈనాడు ఈ దేశంలో అత్యంత సాధారణంగా కనిపిస్తున్న ఒక వికృష్ట పరిస్థితి. ఇలాంటి కథలు రోజూ పేపర్లో చదువుతున్నా ఎవరికీ స్పందన లేదు. తమదాకా వచ్చేదాకా ఎవరికీ ఆలోచనలేదు. అత్తింట్లో నరకం చవిచూసి ఆడపిల్లకు పుట్టింట్లో కూడా సరైన న్యాయం జరగదు. ఏం చేయాలో ఎటు వెళ్ళాలో దిక్కుతోచని పరిస్థితుల్లో పెళ్ళైన ఆడపిల్లలు బలవంతంగా ప్రాణాలు కూడా తీసకుంటున్నారు. ఆమె చాలా నయం. అంత అఘాయిత్యానికి ఒడిగట్టలేదు.

హృదయం వున్న వారెవరికైనా ఆమె కథ జాలికలిగించి తీరుతుంది.

అతని హృదయం ఆమె కథ విన్నాక జాలితో కరిగి నీరైపోయింది.

(ఈ కథకు ముగింపువచ్చేవారం)

## అపూర్వ శక్తిగల ఉంగరం

మీరు ఇప్పుడు నిరాశ చెందకండి. శుభ ముహూర్తంలో గ్రహాణానుసారం తయారు చేయబడిన ఈ తాంత్రిక ఉంగరం ధరించడం వలన కోరుకున్న వ్యక్తిని వశం చేసుకునే వీలుంది. కఠిన హృదయములు కూడా మీ వశంలోకి వచ్చి, మీ అడుగుజాడలలో నడుచుకుంటూ మీ ఆజ్ఞను శిరసావహిస్తారు. ఇష్టపడిన వారితో వివాహం జరుగుతుంది. ఉద్యోగం దొరుకుతుంది. ప్రేతాత్మలతో మాట్లాడవచ్చు. కోర్టులో గెలిచే అవకాశం ఉంది. పరీక్షలలో ఉత్తీర్ణులవ్వచ్చును. వ్యాపారంలో లాభం వస్తుంది. దుష్టగ్రహాలు శాంతిస్తాయి. జీవితం సుఖశాంతులతో నడుస్తుంది.

ఈ తాంత్రిక ఉంగరం యొక్క వెల రూ. 51/- 24 గంటలలో వెంటనే ప్రభావం చూపిస్తుంది. మీ పేరు ప్రకారం అష్టధాతువులతో తయారు చేయబడుతుంది. చాందీవారి ప్రత్యేక సికిందర్ ఉంగరం వెల 101/- తపాలా ఖర్చులు అదనంగా చెల్లించవలసి ఉంటుంది. ఈ ఉంగరాల ప్రభావం ఎప్పుడూ తప్పుగా పనిచేయదు. వీటి ప్రభావం సరిగా కనుక లేకుంటే మీరు చెల్లించిన మూల్యానికి రెట్టింపు వాపసు చేయబడుతుంది. ఇది వాస్తవం కాదని నిరూపించగలిగినట్లయితే అట్టివారికి రూ. 1000/- నగదు రూపంలో ఇవ్వబడుతుంది. ఒకసారి వాడి చూడండి. మీకే తెలుస్తుంది. ప్రత్యేక శక్తివంతమైన బంగారు ఉంగరం రూ. 275/-లు వి.పి.పి. ద్వారా తెప్పించుకునే చిరునామా. పోస్టేజి అదనం.

**SANKAT HARAN ASHRAM (S.W)**
**P.O. Maira Barith (GAYA)**